మణి

శ్రీమతి పెద్దిశెట్టి రామసంగారు

(అనుబంధకథ)

[రామచంద్రరావుగారి కుమారుడు మాధవరావు చెన్నపట్నములో బి.యె. చదువుచు వరశుల్కమునకు విరోధముగ లెక్చర్లిచ్చి, ఇంటికి శెలవులలో వచ్చి, తన యిరుగింటి మణియను పిల్లను చూచి మోహించి పెండ్లాడెదనని చెప్పి ముద్దుపెట్టుకొనెను. ఒకనాడు సాయంకాలము బీదికి షికారుపోయి సబ్‌జడ్జీ ప్రసాదరావు కూతురు లీలను చూచి ప్రేమించి మణిమీద మరులు మరచిపోయెను. తండ్రి వేరొకనాడు ప్లీడరు జనార్దనరావు పెద్దకూతురు వసుంధరాదేవి అంతచక్కనిది కాకున్నను తాను పెండ్లియాడకతీరదనియు వారెక్కువ కట్నమిత్తురనియు చెప్పెను. మాధవరావు తండ్రి నెదిరించలేక సమ్మతించెను. మణితండ్రి ఆనందరావుగారికి రామచంద్రరావుగారిందువిషయమై శుభలేఖ వ్రాసెను. ఆనందరావు ఆ శుభలేఖను మణికి చూపించగా వారి కుటుంబమెల్లయు మిగుల ఆశ్చర్యపడి విచారింతురు.]

ఆ పత్రిక మణి చదివి చాల సంతోషించినది. ఆ ముగ్ధయొక్క అమాయకత్వము! ఆమె పెండ్లికి వెళ్లవలయునని చాల ప్రయత్నించినది గాని ఆమె తల్లిదండ్రులు వెళ్లుట మంచిదికాదని చెప్పుటచే వెళ్లలేదు. వసుంధరాదేవికిని, మాధవరావునకు వివాహమైనది గాని మాధవుని హృదయములో వసుంధరకు తావులేదు. లీలయొక్క మూర్తియే నిండియున్నది. మాధవుని వివాహమైన మూడుమాసములలోనే మణిని మేనమామయగు కమలాకరరావు, బి.యె.కు ఇచ్చి వివాహమొనర్చిరి. వివాహమైన వెంటనే పునస్సంధానము చేయవలెనని సంకల్పించుకొనిరి గాని మంచిదినము కాకపోవుటచే 20 దినములు పోయినతరువాత చేయ నిశ్చయించుకొన్నారు. ఇంతలో అకస్మాత్తుగా జ్వరము వచ్చి నాలుగుదినములు జ్వరము కడుపునొప్పితో బాధపడి యీమాయాప్రపంచకముపై మణిని దుఃఖము పాల్‌చేసి యీలోకం బాసినాడు. ఆనందరావు జ్ఞానాంబల దుఃఖము ఇంతనివర్ణింప నలవి కాదు. మణి పాపం ఒక్కదినమైన భర్తతో కలిసియుండలేదు గాని విధవ అయినది. ఈ దుర్వార్త విని మణిఅన్నయగు కేశవరావు వచ్చినాడు చెన్నపట్టణంనుండి. కేశవరావుకు మణిఅన్న పంచప్రాణములును. ఆయన తండ్రిని సమాధానపరచి మణికి స్వయంగా తాను ఇంగ్లీషు లెక్కలు సైన్సు మొదలగునవి అన్నియు ఇంటివద్ద నేర్పి స్కూల్ ఫైనల్ పరీక్షకు కట్టించినాడు. మణియొక్క తెలివితేటలు కనబరచుటకో యనునట్లు ఫస్టుగా స్కూల్ ఫైనల్ ప్యాసయినది. అన్నగారు యం.బి.బి.యస్. పరీక్ష ప్యాసుఅయినట్లుగా తెలిసినది. వారికి గ్రుడ్డిలో మెల్లవన్నట్లు మణి విచారములో యీ సంతోషవార్త కొంచెము వారి మనస్సుకు సంతోషమైనది. ఏమి సంతోషము, పాపం ఆదంపతులకు, కేశవరావు స్వయంగా డిస్పెన్సరీ పెట్టుకొని ప్రాక్టీస్ మొదలుపెట్టినాడు. ప్రతివారు మందులకొరకు కేశవుని దగ్గరకే వచ్చెడివారు. చాల మంచియువకుడు. అతని రూపురేఖావిలాసములు ఆకర్షణీయముగ నుండెను.

25 సంవత్సరములు. ఇంకనూ వివాహము కాలేదు. మంచి దయార్ద్రహృదయుడగుటచేతనే ప్రతివారును ఇతనివద్దకే వచ్చెడివారు ఔషధములకొరకు. తన చెల్లెలు స్కూల్ ఫైనల్ యందు ఫస్టుగా ప్యాసుఅయినందుకు చాల ఆనందమును పొందినాడు. మణిని యస్. యే. చదివించెద నన్నాడు. తల్లిదండ్రులు ముందుకొంచెము శంకించినారుగాని పోనీ ఏదో చదువుగొడవలోపడిన భర్తను మరచి ఏదో కాలక్షేపము అవును పిల్లకు అని తలయూచిరి. చెల్లెలను చదివించుచున్నాడు మణి చాల తెలివితేటలది గాన బహుశ్రద్ధగా చదువుచు తెలియని విషయములు అన్న నడుగుచు యస్. యే. పూర్తిచేసినది. L. M. P కి చదివించెదనని అన్న తల్లిదండ్రులను సమ్మతింపజేసి చెల్లెలను చదివించుచున్నాడు. మణికి ఒక్కొక్కసారి భర్త తలంపుకువచ్చిన అయ్యో! నేను వెధవనైతిని కదా అనుకొని, ఛా! నేను ఎందులకైతిని, నామాధవుడు బ్రతికియున్నాడుకదా, నాహృదయము దొంగిలించి, నన్ను ప్రేమపాశమున బంధించినాడు నా మాధవుడు గాని కమలాకరుడు నా భర్తకాడు" అని అనుకొనుచుండెడిది.

మాధవుడు బి.యల్ ప్యాసుఅయినందున ప్రాక్టీసు మొదలుపెట్టినాడు. ఏదో యొక మోస్తరుగానున్నది. వసుంధర సుగుణముల కుప్ప. అత్తగారిని తన కన్నతల్లి కన్నామిన్నగా చూచుచు కొద్దిదినములలోనే ఆమె దయకు పాత్రురాలైనది. వసుంధరను వివాహ మొనర్చి తండ్రి చాల అప్పులపాలయినాడు. ఇంటిమీద తెచ్చిన రెండువేలకు అప్పులవాళ్లు పీకుచుండిరి. ఆబాధపడలేక ఇల్లుఅమ్మివేసి ఆఅప్పు తీర్చినాడు. ఇప్పుడు తినుటకు తిండిలేదు. కట్టుటకు బట్టలేదు. ప్రాక్టీసు చూస్తే యేమిలేదు. నానాఇబ్బందిపాలు అవుచుండిరి; వసుంధరకు యీసంగతి తెలిసి అయ్యో! పరాత్పరా! వరశుల్కము పేర మనుష్యులను పీల్చి పిప్పిచేయుచున్న యీదురాచారమును ఎప్పుడు మట్టు చేయుదువోకదా ? అని లోలోపల దుఃఖముతో కుములుచున్నది. సరిగా తిండితినెడిది కాదు. మాధవుని చరిత్రచూస్తే ఎప్పుడు ఏదో ఆలోచిస్తూవుంటాడు ఆమహానుభావుడు, సరిగా వసుంధరను చూడడు. ఏదో వస్తాడు, పైకివెళ్తాడు మళ్లీ. భోజనము వేళకు వస్తాడు, వసుంధరకు ఆయన యుద్దేశమేమో బోధపడలేదు. ఇంతలో ఆమె గర్భిణీతోయున్నది.

జనార్ధనరావుగారికి 20 దినములనుండి జ్వరము వచ్చుచున్నది. సాయంకాలము నాలుగుగంటల సమయము పక్షులు తమతమగూడులు చేరుచున్నవి. జనార్ధనరావుగారు రుక్మిణమ్మను పిలిచి వసుంధరి పెండ్లిచేసి ఇంత కష్టములపాలయితిమి. ఆవరశుల్కమే నాప్రాణములు తీయుచున్నది. ఇంతకష్టపడి చేస్తిమి. మాధవుడు వసుంధరను సరిగా చూడడట. సబుజడ్జీ ప్రసాద్ రావుగారి కుమార్తెలీలను ప్రేమించియున్నాడట. ఈసంగతి మొన్నను వింటిని. ఏదో అయిపోయినది. నేను వెళ్లుచున్నాను. ప్రేయసీ ఇకనైనా నీవు మన శ్రీలతకు బాగాచదువుచెప్పించి వరశుల్కము పుచ్చుకొనని మంచి సహృదయునికి ఇచ్చి వివాహ మొనర్పుము. నేను వెళ్ళిపోవుచున్నాను. నన్ను క్షమింపుము. ఇద్దరు కుమారులను ఎట్లుచూచెదవో కదా. ధారాపాతముగా కారుచున్న కన్నీటిని తుడుచుకొని పిల్లలను కాపాడుమని ప్రేయసీ గడ్డముపట్టుకొని కన్నీటినికుడిచి, రుక్మిణీ! ఒక్కసారి శ్రీలతను పిల్లలను పిలువుము. శ్రీలతాయని మోహనా, అని భాస్కరాయని పిలవగానే పిల్లలువచ్చిరి. తండ్రి శ్రీలతను ప్రక్కను కూర్చొనబెట్టుకొని, అమ్మా, నీ అక్క పెండ్లిచేసి మనము చాల కష్టములపాలయితిమి. నీవు యీ పరీక్ష ప్యాసుఅవుటతోనే స్కూల్ ఫైనల్ కు తప్పకకట్టుము. అది ప్యాసుఅయి తమ్ముళ్లను తల్లిని పోషించుటకు ఎక్కడనైన పనిచేయుము. తల్లీ నాభారమంతయు విడిచి వెళ్లిపోవుచున్నాను. నీవు చక్కనివాడును సరళస్వభావముగలవాడును,

వరశుల్కమును ద్వేషించుకొనువానిని చేపట్టి చక్కని సుపుత్రులనుగలిగి చిరంజీవివై యుండువుగాక అనిదీవించి ఇద్దరుకుమారులను ముద్దులాడి నాయనా! మోహనా, బాబూ! భాస్కరా! అమ్మని అదిఇమ్మని ఇదిఇమ్మని అడగకుడు. చక్కగా చదువుకొని మంచికీర్తిని సంపాదించుడు. మీరు పెండ్లిండ్లుచేసుకొన్న కట్నంపుచ్చుకొనవలదు. కట్నం ఎంతమాత్రం పుచ్చుకొనవలదు. అదిమాత్రం జ్ఞాపకముంచుకొనుడు'' అని పలికె రుక్మిణీ! నీవే అట్లు దుఃఖించిన పిల్లలు బెంగటిల్లెదరు. ఏడవకుము అని వోదార్చి తను యీ ప్రపంచకం వీడినాడు.

చదువరీ! వరశుల్కము ఎంతపనిచేసినదో చూడుము. డబ్బు లేకపోగానే, పిల్లలను ఎట్లుపెంచుట అని బెంగపెట్టుకొని జ్వరము తెచ్చుకొని ఆ బెంగతోనే పాపంజనార్దనరావు యీలోకంవిడిచినాడు. అయ్యో! పండువంటి సంసారము వరశుల్కమువల్లనేకదా ధ్వంసమైనది. రుక్మిణమ్మ పాపం భర్తపోవుటచే చైతన్యము తప్పిపడిపోయినది. శ్రీలతచేసిన ఉపచర్యలకు కొద్దిసేపటికి తెలివితెచ్చుకొని ధైర్యముబూని భర్తకు చేయవలసిన అగ్నిసంస్కారమంతయు చేసినది. శ్రీలత తండ్రి అవసానకాలమందు నుడివిన పలుకులు జ్ఞప్తియందువుంచుకొని చాల శ్రద్ధగా చదివి స్కూల్ ఫైనల్ యందు ప్యాసుఅయి అక్కడనుండి ట్రైనింగ్ రెండువత్సరములు చదివి అక్కడనే పని చేయుచున్నది.

లీలాకుమారి యస్.ఎ. ప్యాసుఅయినది. మాధవుడు లీలను తరుచుగా కలుసుకొనుచుండెడివాడు. మాధవునికి లీలను ఎటులైనా పొందవలెనని యున్నదిగాని ఎట్లుపొందగలడు. వసుంధర ధర్మపత్నియై వున్నది కదా. వసుంధరకు ఆడపిల్లజన్మించినది గాని అందుకు సంతోషించుటకు బదులు తండ్రి చనిపోయినవార్త వినబడినది. దానితో పాపం ఆ యువతి చాలవిచారముతో క్రుంగిపోయినది. అయ్యో! నాతండ్రి నావివాహముచేసి తినుటకు తిండిలేక నానాఇబ్బందిపాలయి ఆఖరకు యీ మాయా ప్రపంచమును వీడినాడని బహుసంతాపముపాలయినది. వసుంధర పాపం యీలాగున ఎప్పుడు విచారిస్తూయుండెడిది. ఆకుమార్తె జన్మించిన మరి రెండుసంవత్సరములకు కుమారుడు జన్మించినాడు. కుమార్తెపేరు మనోమోహినిఅనియు, కొడుకుపేరు కీర్తిశేషులైన తండ్రిగారిపేరు జనార్దనరావు అనియు నామధేయము పెట్టుకున్నది. వసుంధర మనస్సుకు సంతోషములేదు. తండ్రియా తన్నుగురించి కష్టములు పడి ప్రాణములు విడిచినాడు. ఆమెకు దుఃఖముగాక వేరేమియున్నది. ఏదిఎట్లైనను భర్త ప్రేమతోచూచిన యీకష్టములన్ని లెక్కకు రాకపోవునుగాని. భర్తకు ప్రేమలేదు. ఇట్లున్నది ఆమెస్థితి. ఆమె బెంగతో కృశించి అత్తమామలకు భర్తకు తనబిడ్డల నప్పగించి స్వర్గస్థురాలైనది. వసుంధర పాపం సుందరమ్మను రామచంద్రరావుగారిని దుఃఖములో ముంచినది. రామచంద్రరావుగారికి వృద్ధాప్యము వచ్చినది. ఆస్తి నంతయు కొడుక్కిఅప్పచెప్పి ఆయనకూడ వియ్యంకుని కలుసుకొనుటకు వెళ్లినాడు.